ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరపై సమీక్ష

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయ ప్రాంగణంలో బోనాల జాతర ఏర్పాట్లపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. పోలీసులు, జీహెచ్ఎంసీ, జలమండలి, ఆర్అండ్‌బీ, హెల్త్, దేవదాయ శాఖ అధికారులు భక్తుల సాకర్యార్థం చేసే ఏర్పాట్లను వెల్లడించారు.

పటిష్ట బందోబస్తు :డీసీపీ

బోనాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ తెలిపారు. రెండు రోజుల పాటు 24 గంటలు పనిచేసేలా క్రైం టీంలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆలయం లోపల, బయట ఎలక్ట్రిసిటీ అధికారులు ఫైర్ పరికరాల పనితీరు సరిచూసుకోవాలని, సకాలంలో అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు.

పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యం: జోనల్ కమిషనర్

జాతరలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనులు నిర్వహిస్తామని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. 24 గంటల పాటు కార్మికులు అందుబాటులో ఉంటారన్నారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేక మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రోడ్ల ప్యాచ్‌వర్కులు చేపట్టామని, వరదనీటి డ్రైన్‌లు శుభ్రం చేస్తున్నామని, ప్రతి స్ట్రీట్‌లైట్ వెలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నిరంతర తాగునీటి సరఫరా: వినోద్ జీఎం

ఆలయ పరిసర ప్రాంతాల్లో మూడు రోజుల పాటు నిరంతరంగా తాగునీటి సరఫరా చేస్తామని, ఐదు ప్రాంతాల్లో నీటి ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు సరఫరా చేస్తామని, క్యూలైన్లలో కూడా భక్తులకు తాగునీరు అందిస్తామని, డ్రైనేజీ లైన్లు మొత్తం క్లీన్ చేసి ఎక్కడ మురుగు నీటి ప్రవాహం లేకుండా చూస్తామని చెప్పారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం: దేవాదాయ శాఖ కమిషనర్

జాతరలో పాల్గొనే పోలీసులు, వలంటీర్లు, ఆలయ కమిటీలకు సీపీఆర్‌పై అవగాహన ఎంతో అవసరమని దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతు సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు దీనిపై అవగాహన కల్పించాలని అన్నారు,

ప్రత్యేక వైద్య శిబిరాలు: రాజేశ్వరి

భక్తుల కోసం మహంకాళి పోలీస్ స్టేషన్, రోచా బజార్, అంజలీ థియేటర్, సంతోష్ స్వీట్ హౌజ్ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో రాజేశ్వరి తెలిపారు. అలాగే ప్రత్యేక అంబులెన్సులు, ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

భక్తుల మనోభావాలు గౌరవించండి: మంత్రి

ఆలయ ముందు రోడ్డు ఎత్తుగా ఉండి అమ్మవారు పూర్తిగా లోతట్టులో ఉండి భక్తులకు కనిపించడం లేదని ఇది సాంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని, తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చీర సుచిత్ర మాజీ కార్పొరేటర్లు వసంత యాదవ్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

జేబీఎస్ నుంచి స్వర్ణగిరికి బస్సు సర్వీసులు షురూ

కంటోన్మెంట్: జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి యాదాద్రి జిల్లా భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి ఆలయానికి ప్రత్యేక బస్సు సర్వీసులను కంటోన్మెంట్ డిపో అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం రామ్మోహన్ మాట్లాడుతూ యాత్రికుల సౌకర్యార్థం ఉదయం 7 నుంచి రాత్రి 10.40 గంటల వరకు ప్రతి గంటకు ఒకటి చొప్పున డీలక్స్ బస్సులు నడుస్తాయన్నారు. జేబీఎస్ నుంచి స్వర్ణగిరి వరకు టికెట్ ధర రూ.100 ఉంటుందని తెలిపారు. తార్నాక నుంచి రూ.90, ఉప్పల్ ఎక్స్ రోడ్డు నుంచి రూ.80, ఘట్‌కేసర్ నుంచి రూ.60 చొప్పున టికెట్ ధర ఉంటుందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ఈ బస్సు ప్రయాణికులకు వర్తించదని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీపతి కృష్ణ, కంట్రోలర్లు బి. మల్లయ్య, పబ్బ శ్రీనివాస్, హరికృష్ణ పాల్గొన్నారు.

30న బోయిన్‌పల్లి మార్కెట్‌లో అన్నదానం

సనత్‌నగర్: బోయిన్‌పల్లి మార్కెట్ వర్తకుడు, కార్మికుల సంఘం మాజీ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం ఈ నెల 30న బోయిన్‌పల్లి మార్కెట్‌లో అన్నదానం నిర్వహించనున్నట్లు మార్కెట్ వెహికల్స్ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఏ సమస్య వచ్చినా శంకర్ యాదవ్ అండగా నిలిచి పరిష్కారానికి కృషి చేసే వారని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే అన్ని విధాలా అండగా ఉంటానని, అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఉపాధ్యక్షుడు జనార్దన్, కోశాధికారి బీరయ్య తదితరులు పాల్గొన్నారు.



తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

తలసానిని పరామర్శించిన మాధవరం..

ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు శ్రీహరి తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం

అడ్డగుట్ట: అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని సికింద్రాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రజిత హెచ్చరించారు. అడ్డగుట్టలోని ఇంద్రలక్ష్మీనగర్‌లో అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న ఓ భవనాన్ని సికింద్రాబాద్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రజిత మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని ఎన్నిసార్లు చెప్పినా కొందరు వినడం లేదని, దీంతో అలాంటి వాటిని కూల్చివేస్తున్నామన్నారు. ఆమె వెంట సెక్షన్ ఆఫీసర్ సరిత, వార్డు టౌన్ ప్లానర్స్ ప్రకాశ్, మౌనిక, చైన్‌మెన్లు నాగయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

విలీనంతోనే కంటోన్మెంట్‌లో మెరుగైన సేవలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేస్తేనే ఇక్కడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని సీనియర్ కాంగ్రెస్ నేత, ఆర్టీసీ మాజీ రీజినల్ చైర్మన్ కొత్త సంజీవ రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలిని గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్‌లోని పరిస్థితులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం

అడ్డగుట్ట: అంతర్జాతీయ వితంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తుకారాంగేట్‌లోని బోయబస్తీలో యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీఓడబ్ల్యూ సంధ్యా హాజరై మాట్లాడుతూ పురుషులు మద్యానికి, గంజాయికి బానిసలుగా మారి అనారోగ్యాలతో మృత్యువాత పడుతుండడంతో చిన్న వయస్సులోనే ఆడపిల్లలు వితంతువులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అమన్‌వేదిక అంబిక, విజయ, వితంతువులు తదితరులు పాల్గొన్నారు.

30న పద్మారావునగర్ పార్కు ఎన్నికలు

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్ పార్కు ఎన్నికలు ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్కు పరిరక్షణ, అభివృద్ధి కోసం మూడేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకుంటున్నట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ ప్రతినిధులు శ్రీధర్, రణవీర్, సుబ్బారెడ్డి, కృష్ణయాదవ్, కుషాల్, కె. నిరంజన్‌రావు, ఇ. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ ఉంటుందని, పార్కు వాకర్స్ ముందుకు అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు పాటించని కాలేజీల గుర్తింపు రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నిబంధనలకు విరుద్ధంగా బీ కేటగిరి సీట్లను అమ్ముకున్న ఇంజినీరింగ్ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఉన్నత విద్య కార్యదర్శి ప్రొ. శ్రీరామ్ వెంకటేశ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ రాకముందే కొన్ని కాలేజీల యాజమానులు బీ కేటగిరిలో 99 శాతం సీట్లను లక్షల రూపాయాలకు విక్రయిరచారని ఆరోపించారు.

మాదిగల జనజాతరను జయప్రదం చేయాలి

లాలాపేట: ఎమ్మార్పీఎస్ పురిటిగడ్డ ఈదుముడిలో వచ్చే నెల 7న తలపెట్టిన మాదిగల జనజాతర సభను విజయవంతం చేయాలని డా. నంద్రు నరసింహారావు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం ఆయన అధ్యక్షతన మాదిగ సంఘాలతో సన్నాహాక సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఏర్పాటై 30 ఏళ్లు కావస్తుందన్నారు. కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు ఇటుక రాజు, మాతంగి ఓదెలు, తపెట్ల ప్రవీణ్‌కుమార్, కత్తి ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

గాంధీఆస్పత్రి : నిరుద్యోగ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్న నిరుద్యోగ ఏజేసీ నాయకుడు మోతీలాల్‌నాయక్‌ను గురువారం ఆయన పరామర్శించి మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థుల భిక్షతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మోతీలాల్ నాయక్‌కు ఏమైనా జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌లోని కండ్లకోయకు చెందిన దండుగుల రాజ్‌కుమార్ (21) వృత్తిరీత్యా జొమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. 3 రోజుల క్రితం తండ్రితో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో గుండ్ల పోచంపల్లి - మేడ్చల్ రైల్వే స్టేషన్ల మధ్యలోని పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ

బౌద్ధనగర్: వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారాసీగూడకు చెందిన శారద (71) గురువారం ఉదయం 8 గంటల సమయంలో ఇంటి గేట్ ముందు నిలబడింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి వృద్ధురాలి మెడలోని 2 తులాల బంగారు గొలుసు లాక్కున్నాడు. ఈ పెనుగులాటలో సగం గొలుసు నిందితుడి చేతిలో ఉండగా మిగతా సగం బాధితురాలి చేతికి చిక్కగా నిందితులు వెంటనే పరాయ్యారు. బాధితురాలు వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు.

14 కిలోల గంజాయి పట్టివేత

అడ్డగుట్ట: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకుని పెడ్లర్‌ను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్ జీఆర్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్. జావిద్ వివరాలు వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బహాన్ స్వలసింగ్ (38) అదే రాష్ట్రానికి చెందిన భరత్ అనే వ్యక్తి నుంచి 14 కిలోల గంజాయిని కొనుగోలు చేసి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబర్-2లో జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన స్వలసింగ్ వద్దనున్న రెండు బ్యాగులను తనిఖీ చేయగా సుమారు 3.5 లక్షల విలువైన 14 కిలోల గంజాయి లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

అడ్డగుట్ట: రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన ఎక్కీరల పెద్దరాజు (69) వ్యవసాయం చేస్తుంటాడు. అయితే తిరుపతి దేవస్థానానికి వెళ్లొస్తానని చెప్పి ఈ నెల 26న సాయంత్రం 7 గంటలకు ఇంటి నుంచి బయలుదేరాడు. మరుసటి రోజు ఉదయం చర్లపల్లి నుంచి మౌలాలి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం మధ్యలో పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

రసూల్‌పురా: టీవోలీ రోడ్‌లోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ ఏసీపీ జి. శంకర్ రాజు గురువారం విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు రివర్స్ చేసే సమయంలో విద్యార్థులను పక్కనే కూర్చోబెట్టాలని ఒకవేళ పాఠశాల బస్సులో పంపిస్తే తల్లిదండ్రులే బస్సు వద్దకు వెళ్లి ఎక్కించాలని సూచించారు. కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, సరైన నంబర్ ప్లేట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ నిషేధమని ప్రతిఒక్కరు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ పీఎల్. శ్రీనివాస్, డైరెక్టర్ శ్రీ, ప్రిన్సిపాల్ జి. వనజ, రచనా సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీని వాయిదా వేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట గురువారం వారు మాట్లాడుతూ ఈ నెలలో జరిగే టెట్ పరీక్షను దృష్టిలో ఉంచుకుని డీఎస్సీని వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వివిధ ఉద్యోగాలు, వివిధ కోర్సుల ప్రవేశాల పరీక్షలన్ని వరుసగా ఉన్నందున డీఎస్సీకి చదివే సమయం లేదని దీంతో రెండు నెలల పాటు వాయిదా వేయాలన్నారు. రాహుల్, మంగళదాస్, విజయ్, సాయి, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఓయూలో బొజ్జ తారాకం జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక వేత్త, న్యాయవాది బొజ్జ తారాకం 85వ జయంతిని ఓయూలో విద్యార్థులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) ఆధ్వర్యంలో బొజ్జ తారకం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సైదులు, శ్రీకాంత్‌యాదవ్, చంద్రశేఖర్, రఘు, సాయి, నగేశ్, గోపి, కార్తీక్, సదానందం పాల్గొన్నారు.